అకాల వర్షం.. అపార నష్టం



మహాముత్తారం: తడిసిన మిర్చి



టేకుమట్ల: నేలవాలిన మొక్కజొన్న



కాటారం: మిర్చి కుప్పపై కప్పిన పరదా

- వానతో దెబ్బతిన్న పంటలు
- మొక్కజొన్న, మిర్చి పంటలు నష్టం

మహాముత్తారం: కురుస్తున్న అకాల వర్షానికి మండలంలోని నల్లగుంట మీనాజీపేట, కిష్టాపూర్, ములుగుపల్లి, పెగడపల్లి, ప్రేమ్‌నగర్, జీలపల్లి తదితర గ్రామాల్లో మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. అలాగే కల్లాల్లో ఆరబోయగా మిర్చి తడిసిముద్ద యింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సర్వే చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరుతున్నారు.

నేల వాలిన మొక్కజొన్న

టేకుమట్ల/మొగుళ్లపల్లి: రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న నేలవాలింది. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేలవాలడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాటారంలో..

కాటారం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వర్షం కురిసింది. అకాల వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన మిర్చి, వరి పంటలు నేలకొరిగాయి.

మహదేవపూర్: మండలంలో శనివారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు ఎడపల్లి, కుదురుపల్లి, బ్రాహ్మణపల్లి, బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, సూరారం తదితర గ్రామాల్లోని మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. టార్పాలిన్ కప్పిన కూడా స్వల్పంగా తడిచినట్లు కొందరు రైతులు తెలిపారు.

మల్హర్: మండలంలో కురుస్తున్న అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయామని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి తడిసి, మొత్తబడుతుందన్నారు. అలాగే తొడిమే నల్లబడి, రంగు మారుతుందని పేర్కొన్నారు. దీంతో మార్కెట్‌కు మిర్చి తరలిస్తే రేట్లలో వ్యత్యాసం వచ్చి భారీగా నష్ట పోవాల్సి వస్తుందని వాపోతున్నారు. మిర్చి రేటు డిమాండ్ ఉన్న సమయంలో అకాల వర్షం తమను కోలుకులేని దెబ్బతీసిందన్నారు. మండల వ్యాప్తంగా 1700 ఎకరాల్లో మిర్చి సాగు చేయగా 20 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. కేవలంలో 50 ఎకరాల్లో మినహా మిగిలిన మిర్చిని రైతులు మార్కెట్‌లోకి తీసుకెళ్లినట్లు అధికారులు తెలుపుతున్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం, అన్నారం, పూస్కుపల్లి గ్రామాల్లోని మిర్చి రైతులు అకాల వర్షాలతో ఆందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షాలతో మిర్చి కల్లాల్లో టార్పాలిన్ కవర్లు వేసి కాపాడుకుంటున్నారు. వర్షం తగ్గడంతో కల్లాల్లో మిర్చిని ఆరబెడుతున్నారు. వర్షం ఎక్కువశాతం కురిస్తే పంట నష్టం తీవ్రత పెరుగేదని రైతులు వాపోయారు. చివరికి వర్షం తగ్గుముఖం పట్టడంతో రైతులు ఊపిరిపీల్చుకుంటున్నారు.



మొగుళ్లపల్లి: ఇప్పలపల్లిలో నేలవాలిన మొక్కజొన్న

గణపురం: గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంటలు ధ్వంసమై రైతులకు తీవ్ర నష్టాలను కలిగించాయి. 180 ఎకరాల్లో మిర్చి, 100 ఎకరాల్లో మామిడి, 80 ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి ఐలయ్య ఆదివారం తెలిపారు.



గణపురం: రాలిన మిర్చి

క్లుప్తంగా

చర్య తీసుకోవాలి



మహదేవపూర్: సోషల్‌మీడియా వేదికగా ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న)పై చర్య తీసుకోవాలని బీఆర్‌ఎస్ జాగృతి జిల్లా సీనియర్ నాయకుడు మహేష్ మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తీన్మార్ మల్లన్న ఇతర పార్టీల కనుసన్నాల్లో పనిచేస్తూ జర్నలిజాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భారత జాగృతి అభిమాని మెరుగు లక్ష్మణ్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు బండం లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



మల్హర్: మండలంలోని కొండంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మహిళ గ్రామ కమిటీని మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ ఆధ్వర్యంలో ఆదివారం నియమించారు. అధ్యక్షురాలిగా సమ్మక్క, ఉపాధ్యక్షురాలిగా పుష్ప, సంయుక్త కార్యదర్శిగా శ్రీలత, కోశాధికారిగా లక్ష్మి, సలహాదారులుగా రాజమణి, లక్ష్మి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏనుగు లక్ష్మీనారయణ, బెల్లంకొండ రాజేశ్వర్‌రావు, మల్లారెడ్డి, పోటు ప్రభాకర్‌రెడ్డి, ఇరుకు పోచయ్య, రాజయ్య, శ్రీకాంత్, సంతోష్, సతీష్, స్వామి, మల్లయ్య, సారయ్య పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు



టేకుమట్ల(రేగొండ): తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన రేగొండ మండలంలోని రూపిరెడ్డిపల్లిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గాజుల రాజ్‌కుమార్ అనే వ్యక్తి వృత్తిలో భాగంగా కల్లుగీతా కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అందులో భాగంగా రోజువారిలాగే ఆదివారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో మోకు జారి చెట్టు నుంచి కిందపడిపోగా కాలు విరిగినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం తోటి గీత కార్మికులు పరకాల ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

'డబుల్' ఇళ్లు మంజూరు చేయాలి



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామ ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరుచేయించాలని ఎంసీపీఐ(యూ)రాష్ట్ర కమిటీ నాయకులు పరికిరాల భూమయ్య అన్నారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి లిఖిత పూర్వకంగా వినతిపత్రాన్ని ఆయన అందించారు. ఈకార్యక్రమంలో నాయకులు మొగిళి, నారాయణ, ఈశ్వరమ్మ, సుమన్, పూర్ణచందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఎస్ఎస్ తాడ్వాయి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎస్ఎస్ఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్యను జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ ఆదివారం పరామర్శించారు. రమణయ్య ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ చైర్మన్ వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్, ములుగు మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు రాజాహుసేన్, నాయకులు అజార్, నేరేళ్ల, శంకర్ పాల్గొన్నారు.

ఎరువులు పొదుపుగా వాడితే మేలు



ఎరువు వేస్తున్న రైతు

భూపాలపల్లి రూరల్: రైతులు సంప్రాదాయ ఎరువులైన పశువుల ఎరువులు, వర్మి కంపోస్టు వంటి వాటిని వదిలి కృత్రిమంగా తయారయ్యే రసాయన ఎరువులపై మొగ్గు చూపుతున్నారు. దీంతో రైతులు ఎక్కువగా నష్టపోతున్నారని మహాముత్తారం మండలం స్తంభంపల్లి ఏఈఓ శివకృష్ణ అన్నారు. రసాయనక ఎరువులను పొదుపుగా వాడాలని అలాగే ఏలా వాడాలో ఆయన రైతులకు పలు సూచనలిచ్చారు.

రైతులు తోటి రైతులను చూసి ఎరువులు వేస్తుంటారు. అయితే ఏ పంటకు, ఏ ఎరువు ఎంత వేయాలన్నా విషయాన్ని పట్టించుకోరు. నత్రజని భాస్వరం పోటాష్, పోషకాలను పంటలకు 4:2:1 నిష్పత్తిలో వాడాలి. కాని రైతులు మాత్రం భాస్వరం , పోటాస్‌ను అవసరమైన దానికన్నా తక్కువగాను, నత్రజని చెప్పిన దానికన్నా ఎక్కువగా వాడుతున్నారు. నేలలో పోషకాలను బట్టి, పంటను బట్టి మొక్కలకు రసాయన ఎరువులను అందించాల్సి ఉంటుంది.

ఏ పంటకు ఎప్పుడు వేయాలి..

రైతులు ఏ పంటకు ఏ ఎరువు ఎప్పుడు వేయాలన్నది తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మొక్కలకు వేసిన పోషకాలు సామర్థ్యం పెంచడంలో సరైన సమయం, అవసరమైనన్ని సార్లు వేయడం ప్రభావాన్ని చూపుతాయి. నేల స్వభావం పంటకాల పరిమితి సీజన్, పంటకు పోషణ, అవసరమయ్యే దశల ఆధారంగా నత్రజని 2 నుంచి 4 సార్లుగా, భాస్వరాన్ని ఒకసారి, పోటాష్‌ను రెండు సార్లు వేయడం మంచిది. ఎరువుల బస్తాలపై పోషకాల శాతం ఇవ్వడం జరుగుతుంది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న రాఘవరెడ్డి

మల్హర్: మండలంలోని ఇప్పలపల్లి(కేసారంపల్లి) గ్రామానికి చెందిన మల్లయ్యకు రూ.37వేల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కు మంజూరైంది. దీంతో ఈ చెక్కును బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి ఆదివారం లబ్ధిదారునికి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అక్కల రాజేశ్వరి కత్తెరశాల, అడ్డూరి కుమారస్వామి, నాయకులు అశోక్, గట్టయ్య, రమేష్, మల్లేష్, శ్రీను, దేవేందర్, లచ్చయ్య, హర్ష, రజనీ, కుమార్, దేవేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పేపర్ లీకేజీ'

చిట్యాల: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, జిల్లా నాయకుడు మధు వంశీకృష్ణ అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్షం వలనే పేపర్ లీకేజ్ అయిందని ఆరోపించారు. లీకేజీకి కారకులను వెంటనే శిక్షించాలని కేసీఆర్, కేటీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, హరీష్‌రావు పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహించాలని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు వెంటనే న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలుకల రాయకొముర, ఎంపీటీసీ అనిల్, మండల యూత్ ఉపాధ్యక్షుడు అల్లకొండ కుమార్, గ్రామ శాఖ సహాయ కార్యదర్శి చిలుముల రాజమొగిలి, యూత్ నాయకులు రాజు, బొజ్జం వేణు, మహేష్, సాయి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

మహాముత్తారం: కురుస్తున్న అకాల వర్షానికి నష్టపోయిన మిర్చి రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పిలుమరి సంపత్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న మిర్చి పంటల రైతులను గుర్తించి పంట సర్వే నిర్వహించి ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిచో ప్రజల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

అసంపూర్తిగా సీసీ రోడ్డు నిర్మాణం



సగమే నిర్మించి వదిలేసిన రోడ్డు నిర్మాణం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల పంచాయతీలో సీసరేజీ నిధులతో రోడ్డు నిర్మాణం సగమే చేసి కాంట్రాక్టరు చేతులు దులుపుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. రూ.37లక్షల నిధులతో రోడ్డు నిర్మాణం చేశారు. కానీ పలుగుల పంచాయతీ కార్యాలయం నుంచి గ్రామంలో కొంత దూరం రోడ్డు ఒక పక్కనే చేశారు. మిగితా పక్క రోడ్డు నిర్మాణం చేయలేదు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు తప్పడం లేదు. సదరు కాంట్రాక్టర్ సీసీ రోడ్డు నిర్మాణం సగమే చేసి నిలిపి వేసినా సంబంధిత పంచాయతీరాజ్ అధికారులు, పలుగుల పంచాయతీ పాలకవర్గం నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో సీసరేజీ నిధులన్ని అధికారుల నిర్లక్ష్యంతో ఇలా అస్తవ్యస్తంగా తయారయ్యాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత పంచాయతీరాజ్ ఏఈఈ రవీందర్‌ను ఫోన్‌ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన డీసీఎం

మహదేవపూర్: ఆగి ఉన్న లారీని డీసీఎం వ్యాన్ ఢీకొన్న సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఛతీస్‌గఢ్ నుంచి కర్ణాటక వెళ్తున్న లారీ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మహదేవపూర్–నస్తుర్‌పల్లి ప్రాంతంలో అడవిలో రహదారి పక్కన ఆపాడు. కాటారం నుంచి మహదేవపూర్ వెళ్తున్న డీసీఎం వ్యాన్ లారీని వెనుక భాగం నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ బండం రమేష్‌కు కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు స్థానికుల సాయంతో వ్యాను నుంచి తీసి 108 వాహనం ద్వారా సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించినట్లు తెలిసింది. లారీ డ్రైవర్ లవ్ ప్రీత్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు.



నుజ్జు నుజ్జు అయిన డీసీఎం

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపూర్ గ్రామంలో కంటి వెలుగు, ప్రభుత్వ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఎర్రన్న కళా బృందం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో కళాకారులు మాంకాల యాకూబ్, దుప్పటి రవి, బండారి అనిత, మౌనిక, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు



ప్రమాదానికి గురైన కారు



తోటలోకి వెళ్లిన ట్రాక్టర్

వాజేడు: రోడ్డు పక్కకు ఆగి ఉన్న ట్రాక్టర్‌ను కారు వెనుక నుంచి ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం మండల పరిధిలోని సుందరయ్య కాలనీ వద్ద వాజేడుకు చెందిన రైతులు మిర్చి చేను చుట్టు కంచెను కట్టడానికి కర్రలను తీసుకువెళ్లాడు. అందులో ఉన్న కర్రలను తొలగించి వెనుక డోర్ తీసి జాతీయ రహదారి పక్కకు ఉంచాడు. అదే సమయంలో ఏటూరునాగారం వైపు నుంచి అతి వేగంగా వచ్చిన కారు ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా ట్రాక్టర్‌కు సంబంధించిన వెనుక డోరు ఊడి పోయింది. ట్రాక్టర్ సమీపంలోని మిర్చి చేనులోకి వెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులోని బెలూన్లు ఓపెన్ అవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో నలుగురు వ్యక్తులు ఉండగా అందులో ఒకరి ఎడమ చెయ్యి విరుగగా మరొకరికి మొహంపై గాయాలయ్యాయి. మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలు అయినట్లు తెలిసింది. గాయపడ్డ వారిని వైద్యశాలకు తరలించారు. కాగా ట్రాక్టర్ వెనుక డోరు తీసి ఉంచకపోతే కారు ట్రాక్టర్ కిందకు వెళితే ప్రాణాపాయం జరిగేదని స్థానికులు తెలిపారు.

బురదమయంగా రహదారులు



ములుగు: రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



ఏటూరునాగారం: సాయిబాబా గుడి ఎదుట బురదమయంగా మారిన రోడ్డు

ములుగు/ఏటూరునాగారం: జిల్లా కేంద్రంతో పాటు ఏటూరునాగారంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి రహదార్లు బురదమయంగా మారాయి. ఇరువైపులా సైడ్ కాల్వలు లేకపోవడంతో ఎటువెళ్లక నిల్వ ఉండిపోయింది. ఈ ప్రాంతంలో జిల్లా కేంద్రంలోని రాయినిగూడెం,జంగాపల్లి, కాశిందేవిపేట, సర్వాపూర్, కొత్తూరు, కన్నాయిగూడెం, రాంనగర్, రామయ్యపల్లి గ్రామాలకు వెళ్లే ఆటోల స్టాండ్ ఉంది. దీంతో ఆటోలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే జిల్లాకేంద్రంలోని శ్రీనివాసాకాలని, ప్రగతికాలని, గొల్లవాడ వంటి ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బురదమయంగా మారిన రోడ్లపై నడవడానికి స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ తీరుపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. అవసరం ఉన్న ప్రాంతాల్లో డ్రెయినేజీ నిర్మించి వచ్చే వర్షాకాలంలో సమస్య పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.



ఏటూరునాగారం: నిలిచిన వర్షపు నీరు

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు




పాఠశాల పక్కన రహదారి మధ్యలో ఉన్న స్తంభం



గ్రామంలోకి వెళ్లే దారిలో..

వాజేడు: కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో, ఇంజనీరింగ్ అధికారులు పట్టింపే లేనితనమో, తీసి వేరే చోట వేయిచ్చులే అని భావించారో తెలియదు కానీ మధ్యలో రెండు విద్యుత్ స్తంభాలు ఉంచి రహదారిని వేశారు. మండల పరిధిలోని అరుణాచలపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న కాలనీలో సీసీ రోడ్డు మంజూరు అయింది. సీసీ రోడ్డు వేసే సమయంలో రహదారి మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించి వేరే చోటా వేయాల్సి ఉంటుంది. కాని అలా చెయకుండా సీసీ రోడ్డును వేశారు. రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాల దగ్గర మాత్రం తరువాత తీయడానికి వీలుగా కొంత ఖాళీని వదిలేశారు.

కుంగిపోయిన కల్వర్టు



మహాముత్తారం: వర్షాకాలంలో కురిసిన వర్షాలకు మండలంలోని మీనాజీపేట–నర్సింగాపూర్ వెళ్లే ప్రదాన రహదారిలోని ఒక కల్వర్టు కుంగి పోయింది. దీంతో వర్షం పడినప్పుడల్లా బురదమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాదారులు జారిపడుతున్నారు. అయినప్పటికి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి కుంగిన కల్వర్టు వద్ద మరమ్మత్తులు చేపట్టి వాహనాదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.